క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసంలో యువతకు చేయూత


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిషనర్

జగిత్యాలరూరల్: రాజీవ్ యువ వికాసం పథకంలో యువతకు ప్రభుత్వం చేయూత నందిస్తుందని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. రాజీవ్ యువ వికాస పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతి యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

చిన్నారులకు కూచిపూడి నాట్యం శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో వేసవి సెలవుల్లో భాగంగా 45 రోజుల పాటు చిన్నారులకు కూచిపూడి నాట్య శిక్షణ ఆదివారం ముగిసింది. శిక్షణ నిర్వాహకురాలు యమున ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నాట్యంలో ఉత్సాహంగా పాల్గొనడంపై ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన చిన్నారులకు గజ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తెలు రాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీల ఎన్నికకు సమావేశాలు


అంజన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మేడిపల్లి: ఉమ్మడి మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం మండలాల వారీగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు అంజన్ కుమార్ హాజరై బ్లాక్, మండల, గ్రామ అధ్యక్షుల నియామకం కోసం అభ్యర్థనలను స్వీకరించారు. భీమారం మండలంలో 8 మంది, మేడిపల్లి మండలంలో 6 మంది మండల అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు సమర్పించినట్లు తెలిసింది. త్వరలో మండల అధ్యక్ష పదవులతో పాటు బ్లాక్, గ్రామ శాఖ అధ్యక్షులను మారుస్తారని కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది.

కరాటే పోటీల్లో మెట్‌పల్లి విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్లు, బెల్టులతో విద్యార్థులు

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో జేకేఏ ఇండియా, జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెట్‌పల్లికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మొత్తం పది మంది విద్యార్థుల్లో బ్లాక్ బెల్ట్ పరీక్షలో ఐదుగురు, బ్రౌన్ బెల్ట్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అనంతరం వీరికి నిర్వాహకులు బెల్టులు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ వంశీ నాయుడు ఉన్నారు.

కొత్తచెరువును పునరుద్ధరించండి

మల్లాపూర్: తమ ఊరిని ఆదుకోవాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి మండలంలోని గొర్రెపల్లికి చెందిన ఎన్ఆర్ఐ గెల్లి మల్లేష్ యాదవ్ ఆదివారం ట్విట్టర్(ఎక్స్)లో విన్నవించారు. భారీ వర్షాలకు మూడేళ్ల క్రితం గొర్రెపల్లి కొత్త చెరువుకి గండిపడి మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోయారని, పంటలకు సాగు, పశువులకు తాగునీరందక రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది వానాకాలం కావునా ఎంపీ, ఎమ్మెల్యే వెంటనే స్పందించి గండిపడ్డ కొత్తచెరువు పునరుద్ధరించాలని, తమ గ్రామానికి ఆదుకోవాలని ఎక్స్‌లో విజ్ఞప్తి చేశారు.

గుడుంబా జోరు.. పట్టని తీరు

- పల్లెల్లో గుప్పుమంటున్న నాటుసారా
- మెట్‌పల్లి మండలంలో విచ్చలవిడిగా తయారీ
- నియంత్రణపై దృష్టి సారించని ఎక్సైజ్


దాడులు చేస్తున్న మెట్‌పల్లి పోలీసులు



మెట్‌పల్లిరూరల్: పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోంది. మారుమూల గ్రామాలు, తండాలు, అటవీ ప్రాంతాల్లో గుట్టుచప్పుకాకుండా గుడుంబాను తయారు చేస్తున్నారు. బాటిళ్ల, ప్యాకెట్లలో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా నడిపిస్తున్నారు. ఇదంతా చాలా కాలంగా జరుగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో గుడుంబా తయారీ, విక్రయాలు అడ్డూ అదుపులేకుండా జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో గుడుంబా తయారీ చేసేవాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పించింది. అయినప్పటికీ కొందరు గుడుంబా తయారీని వృత్తిగా మలుచుకుని జోరుగా దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

జోరుగా తయారీ..
ఇతర ప్రాంతాలకు సరఫరా

మెట్‌పల్లి మండలంలో గుడుంబా తయారీకి అడ్డూ అదుపులేకుండా పోతుంది. ఇక్కడి ప్రాంతంలోని నాలుగైదు గ్రామాల్లో గుడుంబా తయారీ పెద్ద ఎత్తున జరుగుతుందనేది బహిరంగ రహస్యం. మద్యం ధరలు ఎక్కువగా పెరగడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు తక్కువ ధరలో లభించే గుడుంబా వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో ఉండే గుడుంబా తక్కువ ధరకు రావడం, కిక్కు ఎక్కువగా వస్తుండడంతో గుడుంబాకు చాలా మంది బానిసవుతున్నారు. రహస్య ప్రదేశాల్లో గుడుంబాను తయారీ చేస్తుండగా, వీటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని గ్రామాలు, పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో గుడుంబాకు అలవాటుపడిన కొందరి తీరును చూసి ఆ గ్రామస్తులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది చూసిన ఎందరో తమ గ్రామాల్లో గుడుంబాకు అడ్డుకట్ట వేయాలని ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినా అడ్డుకట్టపడలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోని ఎక్సైజ్.. రంగంలోకి పోలీసులు

నిషేధిత గుడుంబాపై ఎక్సైజ్ శాఖ కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గుడుంబా తయారీపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతోనే విచ్చలవిడిగా గుడుంబా తయారవుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు గుడుంబా తయారీ విషయంపై ఎక్సైజ్ అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడంతో వివిధ గ్రామాల ప్రజలు పోలీసులకు సమాచారమిస్తున్నారు. దీంతో గుడుంబా విషయాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్న పోలీసులు పకడ్బందీగా వ్యవహరిస్తూ స్థావరాలపై దాడులు చూస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మెట్‌పల్లి మండలంలో గుడుంబా తయారీపై గతేడాది కొందరు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్థానిక పోలీసులకు గుడుంబాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆ సమయంలో పక్కాగా నిఘా పెట్టిన పోలీసులు పలు ప్రాంతాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఆత్మనగర్ గ్రామ శివారు ప్రాంతంలో గుడుంబా తయారీ చేస్తున్నట్లు గమనించిన పలువురు మెట్‌పల్లి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం వచ్చిన వెంటనే మెట్‌పల్లి ఎస్సై కిరణ్, సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరాల వద్దకు వెళ్లి దాడులు జరిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ఎక్కడైనా గుడుంబా తయారీ, విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని పోలీసులు సూచిస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నాం. తయారీదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైనా గుడుంబా తయారీ, విక్రయాలు జరిపితే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. వారి వివరాలు గోప్యంగానే ఉంచుతాం. గుడుంబా నియంత్రణకు పోలీస్ శాఖ తరఫున మా వంతుగా కృషి చేస్తున్నాం.

– పబ్బ కిరణ్‌కుమార్, ఎస్సై, మెట్‌పల్లి



వెల్గటూర్: మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై నిర్మించిన నూతన వంతెనకు ఇరువైపులా మెఘా కంపెనీ కాళేశ్వరం లింక్–2 పనుల్లో భాగంగా భారీ వాహనాలు నడపడంతో రోడ్డంతా ధ్వంసమై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ఆనవాలు లేకుండా పోయింది. నిత్యం వేల సంఖ్యలో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహన దారులతో రద్దీగా ఉండే రోడ్డును నెలల తరబడి మరమ్మతు చేయకపోవడంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నూనె శ్రీధర్, ఇరిగేషన్ ఈఈ, సెల్ నం: 9390050552

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

జగిత్యాలటౌన్: తమ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని హరిత హోమ్స్ అసోసియేషన్ కాలనీవాసులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఏర్పాటైన హరిత హోమ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యేకు పరిచయం చేసిన అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తులసినగర్ (పల్లిగ్రౌండ్)లోని హరిత హోమ్స్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, కరెంట్ పోల్స్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. వారి విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే అన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు భైరం హరికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరుముల్ల పవన్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు భైరం హరికిరణ్, రాజేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని, అన్ని వర్గాల ప్రజలు రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకుని రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని సర్వాపూర్ పరిధిలోని కొత్తపల్లెలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి ఆవిష్కరించి మాట్లాడారు. సమ సమాజ స్థాపనే ధ్యేయంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు బాధ్యతలు నెరవేర్చాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొత్తూరి నర్సయ్య, లంక దేవయ్య, భూత్కూరి రమేశ్, కొత్తూరి తిరుపతి, సీఐ నీలం రవి, దొంగ ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని కిషన్‌రావుపేట, చెగ్యాం గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ యువతులకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టుమిషన్లు పంపిణీ చేసి ఉపాధి చూపడం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పూదరి రమేశ్, రంగు తిరుపతి, మురళి, శ్రీకాంత్‌రావు, సందీప్‌రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్లాపూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంజూరు చేయించిన లక్షలాది నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై వివక్ష చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోడూరి భిక్షపతి, హన్మాంతు తదితరులు పాల్గొన్నారు.

మానాల గ్రామ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

మల్యాల: మానాల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మండలంలోని మానాల బీరయ్య ఆలయానికి ఎమ్మెల్సీ తన సొంత డబ్బులు రూ.2.19 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ నెల 29 నుంచి జూన్ 6 వరకు జరగనున్న బీరప్పస్వామి–కమరాతి కల్యాణం మహోత్సవానికి కురుమ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ వెంకట నర్సింగరావుకు ఆహ్వానపత్రిక అందజేశారు. బీరప్ప ఆలయ పరిసరాలను ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించినందుకు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. మానాల గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తానని, ఎధైనా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్సీ భరోసానిచ్చారు. కార్యక్రమంలో బల్మూరి పాపారావు, ఎడిపెల్లి మల్లయ్య, ఎడిపెల్లి తిరుపతి, తాళ్ల శ్రావణ్, కరుకల విశ్వనాథ్, మరాటి బుచ్చిరెడ్డి, పొన్నం శంకర్, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చైతన్య

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఆదివారం మెట్‌పల్లికి చెందిన సిరి పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ చిలుక చైతన్య 50 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. వర్షకాలంలో వచ్చే రోగాల పట్ల తీసుకోవాలిస్న జాగ్రత్తల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవాలి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలిచి భవిష్యత్తు తరాలకు బాసటగా నిలవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్ల శ్యామ్, మద్దెల నారాయణ, నక్క విజయ్, జీకూరి శ్రీహరి, కడమండ కమలాకర్, బొల్లం రమేశ్, కొల్లూరి సురేందర్, శేర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ధర్మపురి: ధరణి పాస్‌బుక్కులు వచ్చిన రైతులంతా ఐడీ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని ఏఈవో దేవేంద్ర తెలిపారు. మండలంలోని బుద్దేశ్‌పల్లెలో సోమవారం ఉ. 9–30 ని.లకు ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించామని, ధరణి పాసుబుక్కులున్న రైతులంతా తమ ఆధార్‌కార్డులు, ఆధార్ లింకున్న ఫోన్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకోలేని రైతులకు పీఎం కిసాన్ డబ్బులు రావని పేర్కొన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు


బోనాలతో వస్తున్న మహిళలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, రాజేశ్వర్‌రావుపేట గ్రామాల్లో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామస్థులు, భక్తులు ఉదయాన్నే పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో భక్తులు బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పెద్దమ్మ పండుగ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో ఆదివారం పెద్దమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్ అకంతి రాజన్న, నాయకులు, పెద్దమనుషులు, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

బుగ్గారం: మండలంలోని శెకెల్ల గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి స్థానిక పోచమ్మ ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తిరంగా యాత్ర


తిరంగా యాత్రలో బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆపరేషన్ సిందూర్ విజయంపై మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం తిరంగా యాత్రను చేపట్టారు. భారత సాయుధ దళాల గౌరవ సూచకంగా యాత్ర చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. భారత ఆర్మీకి మద్దతుగా నినాదాలు చేస్తు జాతీయ జెండాలను పట్టుకుని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి, నాయకులు తీగల శ్రీధర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

మేడిపల్లి: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలల లో ఖాళీ గా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు, పార్ట్ టైమ్ ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయ అధికారి పి.వెంకటేశ్వర్ రావు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్ తో పాటు బీ.ఎడ్ చేసి ఉండి. కనీసం ద్వితీయ శ్రేణి మార్కులు పొంది ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలతో మే 26 నుంచి 28 వరకు మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో సమర్పించ వచ్చన్నారు. బాలికల పాఠశాల/కళాశాలల లో మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని దరఖాస్తు దారులు గమనించాలని కోరారు. అభ్యర్థులను మెరిట్ మరియు డెమో ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మొలకెత్తిన ధాన్యం


మద్దునూర్‌లో మొలక వచ్చిన ధాన్యం

బుగ్గారం: అకాల వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం మొలకలు వచ్చి రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తోంది. మూడు రోజులుగా వర్షం పడుతుండడంతో తూకం వేయడం ఆలస్యమైంది. దీనికి తోడూ కూలీల కొరత ఉండడంతో తడిసిన ధాన్యం మొలకలు వస్తున్నాయి. దీంతో అన్నదాతలకు తీరని నష్టం కలుగుతోంది. పలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నప్పటికీ మొలకలు వచ్చిన ధాన్యంతో రైతులు నష్టాల పాలవుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ది ఆనందం, శంకర్, దయాకర్, వెంకటరమణ, నరహరి, లక్ష్మణ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.